క్లుప్తంగా

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

వినుకొండ: పట్టణంలోని సుందరయ్యనగర్, వికలాంగుల కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా రెండు కాలనీల్లో నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వడంలో తాత్సారం చేస్తున్నారని, వర్షం వస్తే వరదల్లో నివాసం ఉండాల్సి వస్తుందని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏపూరి గోపాలరావు, ఎం.రామకృష్ణ, టి.గంగాధరరావు, శారమ్మ, అలివేలమ్మ, గాలెమ్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో స్వోవాసిస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలకు ఆరుగురు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ సోమవారం తెలిపారు. ప్రాంగణ ఎంపికల్లో వివిధ బ్రాంచ్‌లకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని, రాతపరీక్ష, టెక్నికల్ రౌండ్, ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు వివరించారు. కంపెనీ హెచ్‌ఆర్ శివకిషోర్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లభిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నరసరావుపేట రూరల్: ఎంఏఎం కళాశాలలో సోమవారం అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినోత్సవం నిర్వహించారు. కళాశాల చైర్మన్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎంవీ రామశేషగిరిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విపత్తు సంభవించినప్పుడు నష్టాన్ని తగ్గించడం, వనరులను సమన్వయం చేసుకోవడం ముఖ్య అంశాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలు, వరదలు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి యువత సిద్ధంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ మెన్ పెనుమాక వెంకటేశ్వరరావు, సతీష్‌బాబు విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దొండేటి చంద్రారెడ్డి, రామాంజనేయులు, అగ్రికల్చర్ ప్రిన్సిపాల్ గోపి, అధ్యాపకులు స్వాతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

నరసరావుపేట: సీపీఆర్ అంటే ఆగిపోయిన గుండెను ఊపిరితిత్తులను తిరిగి పనిచేసే విధంగా చేసే ప్రక్రియ అని డాక్టర్ కూనిశెట్టి గౌతమ్ పేర్కొన్నారు. సీపీఆర్ వారోత్సవాలలో భాగంగా సోమవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వాగ్దేవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కేఎంఎస్‌వీ శ్రీనివాసగుప్త, డాక్టర్ కూనిశెట్టి గౌతమ్ హాజరయ్యారు. డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ వ్యక్తి అపస్మారక స్థితిలో నాడి, శ్వాస అందని సమయంలో ఆ వ్యక్తి కార్డియాక్ అరెస్టుకు గురయ్యాడని గుర్తించి సీపీఆర్ అందించాలని, 30 సార్లు గుండెపై మర్దన, రెండు సార్లు కృత్రిమ శ్వాసను అందించాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరు సీపీఆర్ చేసే విధానాన్ని నేర్చుకోవాలని సూచించారు. శ్రీనివాసగుప్త మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 17 వరకు అవగాహన కార్యక్రమాలు వివిధ కళాశాలల్లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం

బొల్లాపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యత నివ్వాలని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో థీమ్ 5లో భాగంగా ఒక రోజు శిక్షణ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనంతో పాటు గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన ప్రధానమని తెలిపారు. అనంతరం ఎంపీడీవో పి.మాధురి మాట్లాడుతూ థీమ్ 5 ప్రధాన ఉద్దేశం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవడం, గ్రీన్ అంబాసిడర్స్ విధులు, సైడ్ కాలువలు పూడిక తీత వంటి వాటిపై శిక్షణ ఉంటుందని తెలిపారు. పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన పంచాయతీలను తీర్చిదిద్దాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి అక్టోబర్ 2 నుంచి మార్చి 2026 వరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడం అమలు చేయటం జరుగుతుందన్నారు. థీమ్ 5 శిక్షణలో సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నారా వారి పాలనలో

ఏరులై పారుతున్న నకిలీ మద్యం

- మాజీ మంత్రి విడదల రజిని
- నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- బెల్టుషాపులు ఎత్తివేయాలని డిమాండ్



ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట ఎక్సైజ్ స్టేషన్ ముందు నిరసనలో మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: నారా వారి పాలనలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత విడదల రజిని విమర్శించారు. నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ రణభేరి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మాజీ మంత్రి కదం తొక్కారు. అడ్డరోడ్డు సెంటర్ నుంచి చిలకలూరిపేట ఎక్సైజ్ స్టేషన్‌కు ప్లకార్డులు చేతబట్టి నకిలీ మద్యానికి నిరసనగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ స్టేషన్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నకిలీ మద్యం తయారు చేస్తూ, అక్రమ పద్ధతిలో విక్రయాలకు పాల్పడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న టీడీపీ నాయకులు పట్టుబడినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా నకిలీ మద్యం తయారు చేస్తూ టీడీపీ నేతలు కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తాగి ఇప్పటికే ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

\+ గ్రామగ్రామాన వెలిసిన బెల్టు షాపులతో ప్రజల జీవితాలు సర్వనాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సింది పోయి అధికార పార్టీ నాయకులే వేలం పాటలు నిర్వహించటం సిగ్గుచేటని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జరిగేవని గుర్తు చేశారు. రాష్ట్రమంతటా యథేచ్ఛగా నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నా నోరు మెదపని సీఎం చంద్రబాబు ఇప్పుడు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ ద్వారా దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లను పగులగొట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, మంగు ఏడుకొండలు, వడ్డేపల్లి నరసింహారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, ఉడుతా వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కొచ్చెర్ల కిషోర్, దాసరి అంజలి, మైలా రాజేష్, కొప్పురావూరి పటేల్, నాగలక్ష్మి, సయ్యద్ జమీర్, షేక్ నజీర్, షేక్ రమేష్‌బాబు, బండారు జయకుమార్, పఠాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం గ్రామగ్రామాన ఏరులై పారుతుంది

వినుకొండ: రాష్ట్రంలో నకిలీ మద్యం గ్రామగ్రామాన ఏరులై పారుతుందని, వందలాది కుటుంబాలు నకిలీ మద్యానికి బలైపోతున్నాయని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా వందలాది మంది కార్యకర్తలతో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే బొల్లా నరసరావుపేట రోడ్డు ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ తిరుపతి జిల్లా కేంద్రంగా నకిలీ మద్యం తయారు చేయడంతో పాటు అమాయకుల ప్రాణాలు బలిగొనడం దారుణం అన్నారు. ప్రభుత్వం ఒక వైపు నకిలీ మద్యం తయారు చేస్తూ.. మరో వైపు గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి టీడీపీ నాయకులకు ఆదాయ వనరుగా మార్చారని విమర్శించారు. కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు. సిట్ అధికారులతో కాకుండా నకిలీ మద్యం కేసును సీబీఐకి ఇస్తేనే కల్తీ మద్యం తాగి చనిపోయిన కుటుంబాలకు న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైన్ షాపులను ప్రభుత్వమే నడిపి ఎటువంటి కల్తీ లేకుండా చేసిందన్నారు. నకిలీ మద్యం వల్ల చనిపోయిన వారి కుటుంబాలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హయాంలో అక్రమ వ్యాపారాలు జరుగుతున్నాయని, అధికారులు కూడా విధులు నిర్వహించేందుకు జంకుతున్నారని, ఇదంతా ఎమ్మెల్యేకి తెలియదా అని ప్రశ్నించారు. నకిలీ మద్యంపై అలుపెరగని పోరాటం చేస్తామని, అవసరమైతే గ్రామగ్రామాన అక్రమ మద్యాన్ని బెల్ట్ షాపులను అడ్డుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎంఎన్ ప్రసాద్, ఎంపీపీ జయశ్రీవెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజాలతో పాటు ఐదు మండలాల పార్టీ నాయకులు, కన్వీనర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే బొల్లా, పార్టీ శ్రేణులు

అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు అందజేయాలి

నరసరావుపేట: ఎన్నికలకు ముందు కౌలు రైతుల సంక్షేమం కోసం నూతన కౌలు చట్టం చేస్తామని, షరతులు లేకుండా కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేస్తామని, అన్నదాత సుఖీభవ పథకం, బ్యాంక్ రుణాలు వర్తింప చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా హామీలు అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం మోసం చేసిందని కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామినేని రామారావు, వై.రాధాకృష్ణ మండిపడ్డారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాత చట్టం దుర్మార్గమైందని, అధికారంలోకి రాగానే భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభలు నిర్వహించి గుర్తింపు కార్డులు ఇస్తామని, పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తున్నామని, అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించి విస్మరించడం తగదన్నారు. పంట సాగుచేయని భూ యజమానులకు పెట్టుబడి సహాయం ఇస్తున్న ప్రభుత్వం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తున్న కౌలు రైతులను నిర్లక్ష్యం చేయడం తగదని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ రూ.20 వేలు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు వంటివి అందించాలన్నారు. కౌలు రైతుల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో రైతులను ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు. సంఘం మండల కార్యదర్శి కోంద్రు ఆంజనేయులు, చిరుమామిళ్ల మహమ్మద్ ఖాసిం, నరసింహారావు, ఎండ్లమూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



నియామక పత్రాలు అందుకుంటున్న నూతన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంఈవోలు



ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న ఎంఈవో సాంబశివరావు

బొల్లాపల్లి: మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరిందని, అన్ని పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు సోమవారం జాయిన్ అయ్యారని ఎంఈవో-1, 2, జీ చిన్నపరెడ్డి, కే పార్వతిలు తెలిపారు. మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులందరూ ఆయా పాఠశాలల్లో విధులు చేపట్టారన్నారు. వీరిలో 80 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, 51 మంది స్కూల్ అసిస్టెంట్స్ ఉన్నారని తెలిపారు.

నూజెండ్ల: నూతన ఉపాధ్యాయుల చేరికతో మండలంలో పాఠశాలలకు నూతన శోభ సంతరించుకుంది. ఎంఈవో కార్యాలయంలో సోమవారం నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను ఎంఈవో కాకర్ల సత్యనారాయణ అందజేశారు. ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలకు కృషి చేయాలని, సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు. ఎంఈవో-2 రవిచంద్ర మాట్లాడుతూ మెగా డీఎస్సీ 2025 ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు మండలానికి 34 మంది రావటం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవికుమార్, బాలకృష్ణ, శ్రీనివాస్ నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

శావల్యాపురం: నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో నూతనంగా విధుల్లోకి జాయిన్ అయిన ఉపాధ్యాయులను అభినందించారు. నూతన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల కార్యదర్శి రాజారమేష్, షరీఫ్ బాషా అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి రాజీనామా చేయాలి



నరసరావుపేట: నకిలీ మద్యం కేసులో టీడీపీ నాయకుల పాత్ర ఉన్నట్లు తేలి, తమ పార్టీ నేతను సస్పెండ్ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే కేసును సీబీఐకి అప్పగించాలని, అలాగే నైతిక బాధ్యత వహిస్తూ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాజీనామా చేయాలని సోషల్ యాక్టివిస్ట్, మద్య వ్యతిరేక వేదిక నేత ఈదర గోపీచంద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ పార్టీ నేతలే ఉన్న ఈ కేసులో చంద్రబాబు సిట్ వేయడం హాస్యాస్పదంగా, దురుద్దేశపూరితంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీపైకి నెట్టేద్దామనే కుటిల పన్నాగంతోనే జోగి రమేష్ పేరును తాజాగా తెరపైకి తెప్పించారని తెలిపారు. నిజం నిప్పులాంటిదని, బాబు కుట్రలు బెడిసికొడతాయని పేర్కొన్నారు.

ఆర్వో ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని వినతి



చిలకలూరిపేట: ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న మంచినీటి ఆర్వో ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, ఎంపీడీవో కె.శ్రీనివాసరావులను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిలో మోతాదుకు మించి రసాయనాలు కలపడం వలన ఎముకల పటుత్వం లోపించి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్వో ప్లాంట్లను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ బి.రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

మద్యం కేసులో ఆరుగురు బైండోవర్

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను మద్యం కేసులో తహసీల్దార్ బి.నిర్మల ఎదుట సోమవారం హాజరుపెట్టి బైండోవర్ చేశారు. ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు మద్యం కేసుల్లో ఉన్న ఆరుగురు నిందితులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులను, గొల్లాపల్లి మండలం గాటితండాకు చెందిన మరోవ్యక్తిని ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచి బైండోవర్ చేయటం జరిగిందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



వినుకొండ: ఇటీవల విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ క్రికెట్ సెలెక్షన్స్‌లో చీకటీగలపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ చదువుతున్న పల్లెపోగు ఆకాశ్, అమృతపూడి మహేష్‌బాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 క్రికెట్ టీమ్‌కి ఎంపికయ్యారని తెలిపారు. నరసరావుపేట డివిజనల్ స్థాయి చెస్‌లో కె.చతురాసాయి, యువ అనంతేష్, కబడ్డీలో కమతం సుకన్య ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో పీడీ చిన్న పాపారావు, ఇన్‌చార్జి ఖాశీం పీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు, బాధితులు



కలెక్టర్ కార్యాలయం ముందు బాధితులతో ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు

నరసరావుపేట: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవల్లపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దోషులు, వారి వెనక ఉన్న అసలు వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి(ఎంఆర్‌పీఎస్ఎస్) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ మీడియాతో మాట్లాడుతూ తమ అర్జీపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలపైనే దాడులు జరుగుతుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలని కోరారు.

\+ సత్తెనపల్లి నాగన్నకుంటలో గత 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఎస్సీ, బీసీలయిన దాసరి పుల్లమ్మ, కొండలరావులపై మున్సిపల్ అధికారుల వేధింపులు మానుకోవాలని ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షులు మీరయ్యమాదిగ మాట్లాడుతూ 30 ఏళ్లుగా నివాసం ఉంటుండగా ఇటీవల కురిసిన వర్షానికి గుడిసె కూలిపోతే తిరిగి నిర్మించుకునే పనిలో ఉన్న వారిపై సత్తెనపల్లి మున్సిపల్ అధికారులు అక్కడి నుంచి ఖాళీ చేయాలని వేధిస్తున్నారని, వేధింపులు మానుకోకపోతే జిల్లా వ్యాప్తంగా అందరిని కలుపుకొని కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



నాదెండ్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అంశంపై పంచాయతీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శులు తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించి సహకరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్, నాదెండ్ల పంచాయతీ కార్యదర్శి అంకయ్య మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పంచాయతీ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, దోమల నియంత్రణపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహనకు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి పాల్గొన్నారు.

అక్రమ మద్యం సమాచారం ఉంటే తెలియజేయాలి



తహసీల్దార్ వద్ద పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బొల్లాపల్లి: నాటు సారా, అక్రమ, సుంకం చెల్లించని మద్యం విక్రాయాల గురించి సమాచారం ఉంటే తెలప వలసిందిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఈపూరు సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బొల్లాపల్లి ఈపూరు మండలంలో ఆయా తహసీల్దార్‌ల వద్ద పాత నేరస్తులను సోమవారం బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈపూరు మండలం కొచ్చర్ల, బొల్లాపల్లి మండలం ఘాటి తండాకు చెందిన పాత నేరస్తులను గుర్తించి తహసీల్దార్‌ల వద్ద బైండోవర్ చేసి నాటు సారా, మాదకద్రవ్యాలు, అక్రమ, సుంకం చెల్లించని మద్యం విక్రయాలపై వీరికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందని ఎక్సైజ్ సీఐ చెప్పారు.

కళాకారుడు కనకనారాయణ అకాల మృతి



కనకనారాయణ (పాతచిత్రం)


శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు సినీ కో డైరెక్టరు కర్రె కనకనారాయణ (60) సోమవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. వివరాలు మేరకు గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిలో ఉంటున్నాడు. గతంలో ఆయన అనేక నాటికలు, సాంఘిక నాటకాలు స్వయంగా రచించి ప్రదర్శించారు. ప్రభుత్వం తరపున కళాజాతరలు ధమాల్-మాల్ ధమాల్, మద్యపానం వలన సమాజంలో కల్గే దుష్ఫలితాలు తదితర వాటిపై ప్రజల్లో చైతన్యం కల్గించేలా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. స్వర్గీయ మాజీ సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. సినీ పరిశ్రమలో వయ్యారి భామలు-వగలమారి భర్తలు తదితర సినిమాలకు కో డైరెక్టరుగా పనిచేశారు. సినీ గేయ రచయిత డాక్టర్ సినారేకి సన్నిహితుడు. స్వగ్రామంలో కళాభారతి కల్చరల్ థియేటర్స్ సంస్థను స్థాపించి ఎందరో యువకులకు మార్గదర్శకులయ్యారు. ఆయన అకాల మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు సంతానం కలరు.

సంక్షిప్త వార్తలు

గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో మన గ్రోమోర్ సంస్థను సోమవారం వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కోరమాండల్ మన గ్రోమోర్‌ను రైతులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఏ అంకారావు, గ్రోమోర్ సిబ్బంది వికాస్, అనిల్, శ్రవణ్, జాకీర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల ఈ-కేవైసీ నమోదు వేగవంతం చేయాలి



శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో ఈ-కేవైసీ నమోదును వేగవంతం చేయాలని జిల్లా ఉపాధి పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని పోట్లూరు, శావల్యాపురం గ్రామాల్లో ఉపాధి శ్రామికుల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 5 లక్షల 92 వేల మంది ఉండగా ఇప్పటి వరకు 46 శాతం నమోదు పూర్తి అయినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో నమోదు శాతం తక్కువగా ఉన్న ఏరియాలను సందర్శించి వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ-కేవైసీ నమోదుతో నకిలీ మస్టర్ల నియంత్రణ చేయవచ్చునన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ అసిసెంట్స్ చెరుకూరి బాలకృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

నూజెండ్ల: వ్యర్థాల నిర్వహణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించటం ద్వారా గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దవచ్చని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ శిక్షణ కార్యక్రమం పంచాయితీ కార్యదర్శులకు సోమ వారం జరిగింది. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త తొలిగించటంతో పాటు నీడనిచ్చే చెట్లు నాటి వాటి సంరక్షణ బాధ్యతను సెక్రటరీలు చేపట్టాలన్నా రు. గ్రామస్తుల భాగస్వామ్యంతోనే గ్రామ సుస్థిరాభివృద్ధి సాధ్యపడుతుందని సూచించారు. గ్రామా ల్లో మురుగు కాల్వల నిర్వహణ చేపట్టాలన్నారు. వీధిలైట్ల ఏర్పాటుతో పా టు మౌలిక వసతులు ప్రజలకు అందేలా చూడాలన్నా రు. ఎంపీడీవో ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, శిక్షకులు రబ్బాని పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నరసరావుపేటలో చెస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణంలోని సాయి వికాస్ స్కూల్ విద్యార్థులు చెస్ అండర్-14 విభాగంలో లత, కుషాల్ డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. అండర్-17 విభాగంలో లేఖన, బ్యాడ్మింటన్ అండర్-14 బాలికల విభాగంలో నేహ ద్వితీయ స్థానం సాధించారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ వీరాస్వామి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఏవో సుభాని పాల్గొన్నారు.